క్లుప్తంగా

సర్వసభ్య సమావేశం వాయిదా

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ తెలిపారు. సమావేశానికి కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. త్వరలో తిరిగి సమావేశం నిర్వహించే తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

డీటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని డీఆర్సీ భవన్ ఎదుట ఆదివారం డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఐదో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను డీటీఎఫ్ జిల్లా కన్వీనర్ డివిస్తారు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎంపీపీ



వైద్యం చేయిస్తున్న ఎంపీపీ

కెరమెరి: మండలంలోని ఝరి గ్రామానికి చెందిన కుర్సెంగ్ బొజ్జిరావు మోటార్ సైకిల్‌పై కెరమెరికి వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన ఎంపీపీ పెందర్ మోతీరాం వెంటనే ఆయనను వైద్యం నిమిత్తం కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దగ్గరుండి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తరలించారు. ఆయన వెంట ఝరి సర్పంచ్ న్యానేశ్వర్, ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

నేడు పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్

బెజ్జూర్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఉదయం 6 గంటలకు పోలీసు స్టేషన్ నుంచి పరుగు పందెం ప్రారంభమవుతుందన్నారు.

పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని నూర్‌నగర్‌లో కొత్తగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాలేశ్ గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

కెరమెరిలో 'హర్ ఘర్ తిరంగా'



జెండాలు అందజేస్తున్న నాయకులు

కెరమెరి: హర్ ఘర్ తిరంగాలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు జాతీయ జెండాలు పంపిణీ చేశారు. స్వాతంత్య్ర అమృత మహోత్సవ కార్యక్రమం ముగింపులో భాగంగా మండల దుకాణ సముదాయాల్లో, ఇళ్లలో జెండాలు అందజేసినట్లు వారు పేర్కొన్నారు. నాయకులు కోట్నాక విజయ్, బానోత్ వెంకట్, రాథోడ్ రవి, వేణు, శ్రీకాంత్, తుకారాం, గోపీనాథ్, రాథోడ్ సాగర్, వాడై సుభాష్ తదితరులు ఉన్నారు.

రామచంద్ర రామానుజ జీయర్ స్వామికి పాదపూజ



పాదపూజ చేస్తున్న పాల్వాయి దంపతులు

కాగజ్‌నగర్‌టౌన్: శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామికి పాల్వాయి హరీశ్‌బాబు దంపతులు పాదపూజ చేశారు. ఆదివారం పట్టణంలోని సర్‌సిల్క్‌లోని ఆయన నివాసంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ ఈర్ల విశ్వేశ్వర్ రావు, మాచర్ల శ్రీనివాస్, నికోడే అర్జున్, వలపదను రమేశ్, జక్కం తిరుపతి, కొండ తిరుపతి, పాల్వాయి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అండర్‌పాస్.. ట్రాఫిక్ జామ్

- నెలలు గడుస్తున్నా పూర్తికాని అండర్‌పాస్ పనులు
- ఒకే వైపు సర్వీస్ రోడ్డుతో ట్రాఫిక్ తిప్పలు
- పనుల్లో వేగం పెంచాలని కోరుతున్న మండలవాసులు



శివాజీ చౌక్ ప్రాంతంలో నిర్మిస్తున్న అండర్‌పాస్ వంతెన



సర్వీస్ రోడ్డుపై ట్రాఫిక్‌జామ్

వాంకిడి: మండల కేంద్రం గుండా నిర్మిస్తున్న నాలుగు వరుసల జాతీయ రహదారి –363 పనుల్లో జాప్యం జరుగుతుండటంతో మండలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం జాతీయ రహదారిపై రెండు అండర్‌పాస్ వంతెనలు నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో ఖమాన గ్రామానికి వెళ్లే రోడ్డు వద్ద నిర్మాణం పూర్తి కాగా మార్కెట్ ఏరియాలో నాయకుల భిన్నాభిప్రాయాలతో పనులు నిలిచిపోయాయి. గత జనవరిలో నాయకులు ఏకాభిప్రాయానికి వచ్చినా పనుల్లో వేగం పెంచడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో మండలంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

ఒకేవైపు సర్వీస్ రోడ్డు..

మండల కేంద్రంలోని ప్రధాన మార్కెట్ ఏరియా శివాజీచౌక్ కూడలిలో మండల వాసుల రాకపోకలు, దుకాణ సముదాయాలు దృష్టిలో పెట్టుకుని అండర్‌పాస్ నిర్మాణం చేపడుతున్నారు. అండర్‌పాస్ నిర్మాణానికి ముందు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మించాల్సి ఉంటుంది. కానీ ఒకేవైపు సర్వీస్ రోడ్డు నిర్మించి అండర్‌పాస్ పనులు ప్రారంభించారు. దీంతో ప్రస్తుతం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

అండర్‌పాస్ నిర్మాణంపై వివాదం..

సుమారు ఏడాది క్రితమే శివాజీ చౌక్ సమీపంలో అండర్‌పాస్ నిర్మాణం చేపట్టేందుకు నేషనల్ హైవే అధికారులు పనులు ప్రారంభించారు. కానీ శివాజీచౌక్ వద్ద చౌపన్‌గూడ గ్రామానికి వెళ్లే రహదారిపై నిర్మాణం చేపట్టాలని స్థానికులు నిరసనలకు దిగారు. స్థానిక నాయకులు రెండు వర్గాలుగా ఏర్పడి నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో వివాదం తారాస్థాయికి చేరుకుంది. దీంతో వంతెన నిర్మాణం హైవే నిబంధనల ప్రకారం వేరే చోటకు మార్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో సుమారు రెండు నెలల పాటు పనులు ఆగిపోయాయి. తర్వాత అండర్‌పాస్ నిర్మాణాన్ని 20ఫీట్ల వరకు జరిపి నిర్మాణం ప్రారంభించారు. అండర్‌పాస్ వివాదం గడిచి ఇప్పటికీ 8 నెలలు పూర్తి కావస్తున్నా అండర్‌పాస్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. సంబంధిత అధికారులు పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

పనుల్లో వేగం పెంచాలి



అండర్‌పాస్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి. పనులు నత్తనడకన సాగుతుండటంతో స్థానికులతో పాటు మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకేవైపు సర్వీస్ రోడ్డు నిర్మించి అండర్ పాస్ పనులు చేపట్టడం ద్వారా రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- ఎలగతి సుచిత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులకు ఇబ్బంది



జెడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాల వైపు సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అండర్‌పాస్ నిర్మాణంలో వేగం పెంచి త్వరగా పనులు పూర్తి చేయాలి. సర్వీస్ రోడ్డు పనులు చేపట్టాలి. పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు బ్యాంకు పనుల నిమిత్తం వచ్చే జనాలకు ఇబ్బందులు తప్పడం లేదు.

\- ఎంగిలి రాకేష్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు

'మధ్యాహ్న' కార్మికులకు చీరలు

- ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేసే వారికి పంపిణీ
- శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేత



చీరలు అందజేస్తున్న అధికారి

కెరమెరి: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తోంది. ఈ మేరకు ఇటీవల మండల విద్యావనరుల కేంద్రానికి చేరిన చీరలను అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

85 పాఠశాలల్లో 107 చీరలు..

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో మొత్తం 98 పాఠశాలలు ఉండగా మధ్యాహ్న భోజనం కొనసాగుతున్న పాఠశాలలు 85 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 107 మంది ఎండీఎం వర్కర్లు విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారు. వీరందరికి అధికారులు చీరలు అందజేయనున్నారు. ప్రతీరోజు పాఠశాలలకు వచ్చే వేళ ప్రభుత్వం అందించిన చీరలతో రావాలని అధికారులు పేర్కొంటున్నారు.

సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

జిల్లాలో శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో గతేడాది నుంచి రాగి జావ పంపిణీ చేపడుతుండగా, ఈ ఏడాది శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఫౌండర్ మధుసూదన సాయి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎండీఎం వర్కర్లకు ప్రభుత్వ సహకారంతో చీరలు పంపిణీ చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ అసోసియేషన్ కార్యవర్గం



నూతన కార్యవర్గం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక పటేల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహమ్మద్ గౌస్, కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా మైలారపు శ్రీధర్, ఉపాధ్యక్షులుగా ఎండీ సాదిక్, సిద్ధం శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమ నిర్వాహకులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ దస్తగిర్, మాజీ కౌన్సిలర్ షబ్బీర్‌లు వ్యవహరించారు. ఎన్నికల్లో ప్రముఖ వ్యాపారులు గజ్జల శ్రీనివాస్, కౌన్సిలర్లు తాటి జయచందర్, మహమ్మద్ వలి పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

రెబ్బెన: మండలంలోని గోలేటి గ్రామంలో ఆదివారం తీజ్ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. లంబాడీల్లోని పెళ్లికాని యువతులు తొమ్మిది రోజుల పాటు అత్యంత నియమ నిష్ఠలతో పూజలు చేసిన బుట్టలను గ్రామంలో ఉన్న జగదాంబ ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నపెద్దా అనే తేడా లేకుండా గ్రామస్తులంతా తీజ్ వేడుకల్లో పాల్గొని ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం తీజ్ బుట్టలను గ్రామానికి సమీపంలోని ఉన్న వాగులో నిమజ్జనం చేశారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. మాజీ జెడ్పీటీసీ అజ్మార బాబురావు, పెద్దలు దుప్పనాయక్, బలరాం నాయక్, రాజు నాయక్ మహిళలు పాల్గొన్నారు.

జిల్లా మహాసభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకుడు కృష్ణమాచారి

పెంచికల్‌పేట్: తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 17న జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సంఘం నాయకుడు కృష్ణమాచారి పిలుపునిచ్చారు. ఆదివారం ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ గిరిజన పాఠశాలల్లో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం గిరిజన పాఠశాలలో పనిచేస్తున్న డెయిలీ వర్కర్స్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లక్ష్మణ్, సురేష్, కిష్టయ్య, అమృత, సుశీల పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకుంటలేరు..!

కోటపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయం పక్కన మురుగు నీరు నిలిచి అధ్వానంగా ఉంది. గ్రామాల్లో పారిశుధ్యం తొలగిస్తున్నామని గొప్పలు చెప్పుకునే అధికారులు.. తమ కార్యాలయం చుట్టూ అపరిశుభ్ర వాతవరణం ఏర్పడినా పట్టించుకోవడంలేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఎంపీడీఓ కార్యాలయం పక్కనే క్వార్టర్స్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి దుర్గంధం వెళ్లే మురుగునీరుతో నిండిపోయింది అయినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పలువురికి ఆదర్శంగా ఉండాల్సిన అధికారులే ఇలా మురుగు నీరుపై అశ్రద్ధ చూపడంపై పలు విమర్శలు వెల్లువెత్తున్నాయి. గతంలో కూడా క్వార్టర్స్ కాలనీవాసులు పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ, అధికారులు చొరవ చూపకపోవడం ఏంటని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు.

'అభివృద్ధి పనులతోనే చేరికలు'

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీల నుంచి పలువురు బీఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నారని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బొలిశెట్టి సునీత ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు.

ప్రమాదం జరగకముందే.. స్పందించండి!

చెన్నూర్: మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా పయనిస్తున్న తరుణంలో తాగునీటి తిప్పలు తప్పడం లేదు. తాగునీరు కావాలంటే మోటార్ ఆన్ చేసేందుకు కర్రల సాయం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో తాగునీటి వసరులు లేకపోవడంతో కాలనీవాసులు బోరు నీటి పైనే ఆధాపడాల్సిన దుస్థితి నెలకొంది. కాలనీలో మోటార్‌కు ఏర్పాటు చేసిన స్టార్టర్ చెడిపోయింది. పలుమార్లు అధికారులు చెప్పినా.. పట్టించుకోవడం లేదు. దీంతో నీళ్లకోసం యువకులు కర్రలతో రెండు విద్యుత్ వైర్లను జతచేయాల్సి వస్తుంది. విద్యుత్ వైర్లను కలిపే సమయంలో విద్యుత్ షాక్‌కు గురైయ్యే అవకాశం లేకపోలేదు. ప్రమాదమని తెలిసినా, కాలనీ వాసులకు కష్టాలు తప్పడం లేదు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

వేమనపల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రూ.35లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ కోలి స్వర్ణలత, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్, స్థానిక సర్పంచ్ కుబిడె మధుకర్ ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేషం, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేషం, కో ఆప్షన్ సభ్యుడు జాహెద్‌ఆలీ, నాయకులు లక్ష్మీకాంత్, లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ గుమ్ముల సత్యం తదితరులు పాల్గొన్నారు.

మెగా హెల్త్‌క్యాంప్‌నకు స్పందన

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మెడిలైఫ్ ఆసుపత్రిలో ఆదివారం గొంగల్ల శంకర్ మిత్రబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగాహెల్త్ క్యాంపునకు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన సన్‌షైన్, కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కార్డియాలజిస్టు డాక్టర్ శ్రీధర్ కస్తూరి పర్యవేక్షణలో ఉచితంగా వైద్య పరీక్షలు చేపట్టారు. గుండె, కిడ్నీ, ఛాతీ, నరాలు, ఎముకలు, గైనకాలజిస్టు, కాలేయ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్లు, మెడిలైఫ్ ఆసుపత్రి వైద్యుడు కుమారస్వామి పాల్గొన్నారు.

మరుగుదొడ్లు లేక తిప్పలు

- జీపీ కార్యాలయాల్లో టాయిలెట్లు కరువు
- మహిళా సర్పంచులు, వార్డు సభ్యుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



వీర్దండి గ్రామ పంచాయతీ కార్యాలయం

కౌటాల: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేక ప్రజాప్రతినిధులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లోని మహిళా సర్పంచ్‌లు, అధికారులు, వార్డు సభ్యురాళ్లు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండలంలో మొత్తం 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కౌటాల, ముత్తంపేట, సాండ్‌గాం, తాటిపల్లి, గుండాయిపేట, పార్డీ, కనికి గ్రామ పంచాయతీల్లో మాత్రమే మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నాయి. మిగతా 13 పంచాయతీల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. కొత్తగా ఏర్పాటైన తాటినగర్, నాగేపల్లి జీపీలకు నూతన భవనాలు మంజూరు చేయగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. భాలేపల్లి, బోదంపల్లి, శీర్షా గ్రామపంచాయతీ కార్యాలయాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేవు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా గతంలో ప్రతీ పంచాయతీ కార్యాలయానికి మరుగుదొడ్ల నిర్మాణం కోసం సామగ్రి సైతం సమకూర్చారు. కానీ కొన్ని నెలలు నుంచి పనులు ముందుకు సాగడం లేదు.

పంచాయతీలపై పట్టింపేది..?

గ్రామాల్లో వంద శాతం మరుగుదొడ్లు నిర్మించేందుకు గ్రామస్థాయి, మండలస్థాయి ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు. కానీ గ్రామపంచాయతీల్లోనే మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా సిబ్బంది, ప్రజాప్రతినిధులు తమ బాధలు ఎవరికి చెప్పుకోలేకపోతున్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థల్లో, ఉద్యోగాల నియామకాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించింది. కానీ గ్రామస్థాయిలో ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులు, పని చేస్తున్న అధికారులు, సిబ్బందికి పంచాయతీ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. సర్పంచ్, వార్డు సభ్యులు, సిబ్బంది గ్రామ పంచాయతీ సమావేశాల్లో పాల్గొనేందుకు కార్యాలయాలకు వచ్చినప్పుడు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాల్సి వస్తుంది. ఈ సమయంలో మహిళలకు అత్యవసరమైతే ఎక్కడికెళ్లాలో తెలియని దుస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

ఆర్థిక సంఘం నిధులతో నిర్మించాలి



మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో మరుగుదొడ్లు లేని మాట వాస్తవమే. నూతన పంచాయతీ భవనాలు నిర్మించే సమయంలో మరుగుదొడ్లు నిర్మిస్తాం. గతంలో ఉన్న భవనాలకు ఆర్థిక సంఘం నిధులతో మరుగుదొడ్లు నిర్మించుకోవాలి. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపి స్వచ్ఛతకు కృషి చేయాలి.

\- నస్రుల్లాఖాన్, ఎంపీడీవో, కౌటాల

కొలాం సంఘం నాయకుల ధర్నా



కెరమెరిలో ధర్నా చేస్తున్న కొలాం సంఘం నాయకులు

కెరమెరి: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం కొలాం సంఘం నాయకుడు సోనేరావుపై తుడుందెబ్బ మహిళా నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలో సంఘం నాయకులు ధర్నా చేశారు. అనంతరం బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఏఎస్సై బాల్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కొలాం సంఘం నాయకులు సిడాం ధర్మూ, సిడాం భీంరావు, ఆత్రం సోనేరావు, సిడాం రాజు, మడావి రాజు, ఆత్రం భీంరావు, గేడాం మధూకర్, మానిక్‌రావు ఉన్నారు.

దాడిని ఖండిస్తున్నాం



వాంకిడి: మాట్లాడుతున్న సిడాం అన్నిగా

వాంకిడి: కొలాం గిరిజన హక్కుల పోరాట సమితి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావ్‌పై శనివారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కొలాం సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిడాం అన్నిగా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కొలాం సంఘం నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోనేరావుపై మహిళలు దాడి చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. కార్యక్రమంలో కొలాం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం గంగారాం, ఉపాధ్యక్షుడు ఆత్రం జలపతి రావు, నాయకులు కుంరం లింగు, పగ్గ, కట్టి తదితరులు పాల్గొన్నారు.

బోదకాలు నివారణకు మందులు పంపిణీ

తిర్యాణి: బోదకాలను పూర్తిస్థాయిలో నివారించడమే లక్ష్యంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు జోనల్ కోఆర్డినేటర్ శిరీష అన్నారు. ఆదివారం మండలంలో నిర్వహించిన బోదకాల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. మండలంలోని నాయకపుగూడ, కన్నెపల్లి గ్రామాల్లో సందర్శించారు. ఆమె మాట్లాడుతూ బోదకాల నివారణకు ఎత్తు, వయస్సుబట్టి మాత్రలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని వైద్యాధికారులు ఆదేశించారు. తిర్యాణి వైద్యాధికారి హర్షవర్ధన్, వెంకటేష్, ఆశలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

'బైక్'స్టాప్..!



కౌటాల: మండల కేంద్రంలో వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం లేకపోవడంతో మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందు వాహనదారులు భారీగా ద్విచక్రవాహనాలు పార్క్ చేస్తున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో ప్రైవేట్ వాహనాలు పార్క్ చేస్తుండడంతో పలుమార్లు ఆర్టీసీ బస్సులను ప్రధాన రహదారిపైనే నిలపాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో బస్సు ఎక్కేందుకు ప్రయాణికులు రోడ్డు దాటాల్సి వస్తుంది. కాగా మండలంలో వాహనాల రద్దీ పెరగడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. దీంతో మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు.